*మహాకరుణ కలవాడు, అత్యంత దయామయుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.*

# సహీహ్ బుఖారి

**ఉర్దూ అనువాదం : హజ్రత్ అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**  **తెలుగు అనువాదం : షేఖ్ హమీదుల్లా షరీఫ్**

# జనాయిజ్ గ్రంథం

## 88వ అధ్యాయం

**మృతునికి ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో అతని నివాస స్థలం (స్వర్గంలో, నరకంలో) చూపించబడుతుంది.**

461. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెల విచ్చారని, అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు; మీలో ఎవరైనా మరణించినప్పుడు, అతనికి ఉదయం, సాయంత్రం రెండు వేళల్లోనూ తన నివాస స్థలం చూపించ బడుతుంది. ఒకవేళ అతను స్వర్గవాసులలోని వాడైతే అతనికి స్వర్గంలో తన నివాసం ఏదో చూపించబడుతుంది. ఒకవేళ అతను నరకవాసి అయితే అప్పుడు అతనికి నరకంలో అతని నివాసస్థలం ఏదో చూపించబడుతుంది. అప్పుడు అతనితో ఇలా అనటం జరుగుతుంది; అల్లాహ్ నిన్ను ప్రళయం నాడు బ్రతికించి లేపేవరకు ఇది నీ నివాస స్థలంగా ఉంటుంది.

## 89వ అధ్యాయం

**శవం వాహనంపై పెట్టినప్పుడు మృతుడు మాట్లాడటం.**

462. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు; జనాజా తయారైనప్పుడు, తరువాత జనులు దానిని తమ భుజాలపైకి ఎత్తుకున్నప్పుడు - ఒకవేళ అతను ధర్మ పరాయణుడు అయినట్లయితే ఇలా అంటాడు; నన్ను ముందుకు తీసుకువెళ్ళండి. ఒకవేళ అతను సజ్జనుడు కాకపోయినట్లయితే ఇలా అంటాడు. అయ్యో! నేను నాశన మైపోను. నా జనాజాను ఎక్కడకు తీసుకుపోతున్నారు. అతని కంఠస్వరాన్ని మనుషులు తప్ప సృష్టిలోని జీవరాశులన్నీ వింటాయి. ఒకవేళ అతని కంఠాన్ని మనిషి గనుక వింటే, ఆ మనిషి స్పృహ కోల్పోతాడు.

## 90వ అధ్యాయం

**యుక్త వయస్సుకు ఇంకా చేరని, మరణించిన ముస్లిమ్ పిల్లలు ఎక్కడ ఉంటారు?**

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అబూహురైర(ర) ఉల్లేఖించారు; ఒక ముస్లిమ్‌కు చెందిన ముగ్గురు మగ పిల్లలు మరణించినట్లయితే వారు పాపాలు చేసే వయస్సుకు ఇంకా చేరకుండా ఉంటే అప్పుడు వారు ఆ ముస్లిమ్‌కూ, నరకానికీ మధ్య అడ్డంగా నిలబడ తారు. లేదా వారు స్వర్గానికి పోతారు.

463. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖించారు; ఒక ముస్లిమ్‌కు చెందిన ముగ్గురు మగపిల్లలు మరణించి నట్లయితే ఇంకా వారు పాపాలు చేసే వయసుకు చేరకుండా ఉంటే, అప్పుడు అల్లాహ్ వారి పట్ల తనకు ఉన్న కారుణ్యం వల్ల వారిని స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు.

464. బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కుమారుడైన హజ్రత్ ఇబ్రాహీం దివంగతులైనప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; స్వర్గలోకంలో అతనికి పాలు త్రాపటానికి ఒక స్త్రీ ఉన్నారు.

## 91వ అధ్యాయం

**యుక్త వయస్సుకు ఇంకా చేరని ముష్రిక్కుల సంతానం గురించి.**

465. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని ఇలా అడగటం జరిగింది. ఓ దైవప్రవక్తా(స)! ముష్రిక్కుల సంతానం పరలోకంలో ఎక్కడ ఉంటారు; సమాధానంగా ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు; వారిని అల్లాహ్‌యే సృష్టించాడు కాబట్టి ఆయనకే ఈ విషయం బాగా తెలుసు. వారు పెద్దవారైన తరువాత ఎలాంటి పనులు చేస్తారో.

466. హజ్రత్ అబూహురైర(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఇలా అడగటం జరిగింది; ముష్రిక్కుల సంతానం మరణానంతరం ఎక్కడ ఉంటారు? ఆయన(స) ఇలా సెలవిచ్చారు; వారు ఎలాంటి పనులు చేసేవారో అల్లాహ్‌కే బాగా తెలుసు.